క్లుప్తంగా

నేటి నుంచి దుర్గాదేవి యాత్ర


దుర్గాదేవి విగ్రహం

జి.సిగడాం: ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మండలంలోని మధుపాం గ్రామంలో దుర్గాదేవి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ప్రతి ఏటా ముక్కనుమ రోజున ఈ ఉత్సవాలు ప్రారంభించి మూడు రోజులు పాటు నిర్వహిస్తామన్నారు. సుదూరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశామన్నారు. వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీ దేవి విగ్రహం

ఎచ్చెర్ల క్యాంపస్: కొంచాలకూర్మయ్యపేట గ్రామంలోని దేవీ ఆశ్రమంలో మంగళ, బుధవారాల్లో సంక్రాంతి సందర్భంగా ఆలయ పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

గంగమ్మ తల్లికి పూజలు


గంగమ్మ తల్లి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురంలో సంక్రాంతి సందర్భంగా గంగమ్మ తల్లికి మంగళ, బుధవారాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏటా గ్రామంలో సంక్రాంతికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

గ్రామ దేవతలకు చల్లదనం


ముర్రాటలతో బయలుదేరిన గ్రామస్తులు

జి.సిగడాం: మండలం పరిధిలో సంతవురిటి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా పలు కుటుంబాలకు చెందిన భక్తులు గ్రామ దేవతలకు బుధవారం ముర్రాటలతో చల్లదనం చేశారు. గ్రామంలో ప్రతి ఏటా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

అనురాగ నిలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చైతన్యం కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక శాంతాక ల్యాబ్ అనురాగ నిలయం, సీవీ నాగజ్యోతి ఆనంద నిలయంలో అనాథ పిల్లలు, వృద్ధులకు అరసవల్లికి చెందిన అరవింద్ మహదేవ్ అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దాత అరవింద్ మహాదేవ్ మాట్లాడుతూ.. నిత్య సేవకులుగా జగన్‌మోహనరావు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, మేనేజర్ గుణాకరరావు, జీవితకాల సభ్యులు బి.చిన్మయరావు, జి.పవన్ కుమార్, ఉర్లం శివతేజ, ఆశపట్నాయక్ ఉన్నారు.

ప్రసాదం పంపిణీ


భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న సాయికుమార్

రణస్థలం: కోటపాలెంలోని భద్రమహంకాళి అమ్మవారి జాతర మహోత్సవాల్లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం బుధవారం పాల్గొన్నారు. అఖిలాంధ్ర భవానీ సేవా సమితి ఆధ్వర్యంలో ముప్పిడి నారాయణరావు గురుభవానీ సమక్షంలో భక్తులకు ప్రసాదం పింపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శిథిల భవనాలు..
అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలు!

- అఫీషియల్ కాలనీలో నిరుపయోగంగా ఆర్అండ్‌బీ భవనాలు


అఫీషియల్ కాలనీలో శిథిలమైన భవనాలు

శ్రీకాకుళం:

శ్రీకాకుళం నగరంలోని అఫీషియల్ కాలనీలో ఉన్న రోడ్లు భవనాల శాఖకు చెందిన పలు భవనాలు శిథిలావస్థకు చేరాయి. వీటిని సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలుకు అడ్డాగా మారాయి. ఇక్కడ 50కి పైగా ఆర్అండ్‌బీకి చెందిన భవనాలు ఉన్నాయి. ఇందులో ఒక భవనాన్ని జాయింట్ కలెక్టర్ నివాసంగా వినియోగించుకుంటుండగా, మరో భవనంలో ఆర్ అండ్‌బీ ఇంజినీరు కార్యాలయంగా, ఇంకో భవనంలో పౌర సంబంధాల అధికారి కార్యాలయం, ఇంకో భవనాన్ని తపాలా కార్యాలయం కోసం వినియోగిస్తున్నారు. ఇలా పదుల సంఖ్యలో భవనాలు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగిలిన భవనాల్లో మూడు భవనాలను ఆ శాఖ కూల్చివేసింది. పాక్షికంగా భవనాలను మాత్రం అలాగే ఉంచేసారు. దీంతో సాయంత్రం వేళ చాలామంది వీటిని అసాంఘిక కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారు. ఆ ప్రాంతంలో ఉన్నతాధికారి ఉన్నప్పటికీ సాయంత్రమైతే చీకటిగా ఉండటంతో మద్యం తాగడానికి, ఇతర పనుల కోసం అడ్డాగా మార్చుకుంటున్నారు. దీనికి సమీపంలోనే గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు కూడా ఉన్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న యువతను కట్టడి చేయకుంటే హాస్టల్ విద్యార్థులు పక్కదారి పట్టే పరిస్థితి ఉంది. ఇదే శాఖకు పీఎస్ఎన్ఎంహెచ్ స్కూల్ సమీపంలో కూడా భవనాలుండేవి. అక్కడ కూడా ఇదే పరిస్థితి ఉండటంతో ఉన్నధికారుల ఆదేశాలతో ఆ భవనాలన్నీ కూల్చివేసి ఖాళీ స్థలాన్ని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. అఫీషియల్ కాలనీలో మాత్రం ఏ కారణం చేతనో ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంతం రూరల్ పోలీసుల పరిధిలో ఉండటంతో పర్యవేక్షణ కూడా కొరవడటం వలన ఇటువంటి పరిస్థితి ఏర్పడింది.

ఆ ప్రాంతంలోకి వెళ్లాలంటే భయం



నేను ఓ దుకాణంలో పని చేస్తున్నాను. గీతాంజలి పాఠశాల భవనం వెనుకాల నివాసం ఉంటున్నాను. డ్యూటీ ముగిశాక రాత్రివేళ ఆ ప్రాంతం గుండా వెళ్లాలంటే భయమేస్తుంది. మద్యం సేవించి కొందరు యువకులు తూలుతు, తూగుతూ వేగంగా బైక్‌లపై తిరుగుతూ భయం కల్పిస్తున్నారు.

– దీపిక, శ్రీకాకుళం

నిఘా ఉంచుతాం



అఫీషియల్ కాలనీపై ఇప్పటివరకు ఫిర్యాదులు అందలేదు. ఇక మీదట సాయంత్రం వేళ నిఘా ఉంచుతాం. అసాంఘిక శక్తులకపై ఉక్కుపాదం మోపుతాం. మద్యం, గంజాయి సేవించే వారిపై దృష్టిపెడతాం. మద్యం సేవించి వాహనం నడపటం, ఈవ్‌టీజింగ్‌కి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

–పైడపునాయుడు, సీఐ, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, శ్రీకాకుళం

ఉత్సాహంగా జాతర


హాజరైన ప్రజలు


కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారులు


ముకుందరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలోని రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో కనుమ సందర్భంగా బుధవారం జాతర నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, సమీప గ్రామాల ప్రజలు రంగనాథుడుని దర్శించుకున్నారు. జతరలో శ్రీకాకుళం పట్టణం పి.ఎన్.కాలనీకి చెందిన తన్మయి నృత్య నికేతన్ ప్రదర్శించిన కూచపూడి నృత్యం, భరతనాట్యం, జాన పద గీతాల నృత్యం ఆకట్టుకున్నాయి. ధనుర్మాసంలో తిరుప్పావై ప్రవచనాలు బోధించిన విశ్రాంత ఉపాధ్యాయులు బొడ్డేపల్లి ముకుందరావును ఆలయ ట్రస్ట్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

సినీనటుడు సాయికుమార్ సందడి


కుటుంబసభ్యులు, బంధువులతో సినీనటులు సాయికుమార్

శ్రీకాకుళం కల్చరల్ :ప్రముఖ సినీ నటులు సాయికుమార్ సంక్రాంతి పండుగ కోసం శ్రీకాకుళంలోని తన బంధువుల ఇంటికి వచ్చి సందడి చేశారు. ఆయన తోటళ్లుడు వెల్లంకి వరహాలు బాబు, సునీత దంపతుల ఇంటికి వచ్చారు. సాయికుమార్ తన భార్య సురేఖ, కుమార్తె, మనుమరాలు, అల్లుడుతో కలిసి పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంధువులతో కలిసి సంక్రాంతి జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అలాగే పాండ్రంగి వీధిలోని కామాక్షి అమ్మవారి పీఠానికి వచ్చి పూజలు చేసి ఆశీస్సులు తీసుకున్నారు. 'కర్ణపిచాచి' సినిమాలో నటించిన యువనటుడు మంగళంపల్లి నిఖిల్ కూడా తన స్నేహితులతో సాయికుమార్‌ను కలిశారు.

మల్లన్న సన్నిధిలో..



మండలంలోని మెట్టవలసలో మల్లికార్జున స్వామి యాత్రా మహోత్సవాలు సంక్రాంతి నాడు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భారీగా జనం తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్రామపెద్దలు ఏర్పాట్లు చేశారు.

–జి.సిగడాం

విజయ గణపతికి అష్టోత్తర శత దీపారాధన



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతి దేవాలయంలో స్వామికి కనుమ పండుగ సందర్భంగా అష్టోత్తర శత దీపారాధనలు బుధవారం జరిగాయి. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో దీపారాధనలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌కు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ భవనాల వెనుక, సైడ్లు రంగులు వెలసిపోయాయి. గోడలు పెచ్చులూడిపోవడం, పైపులు పాడయ్యాయి. దీంతో మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగానే కర్రలు కట్టి పెచ్చులూడిన చోట ప్లాస్టింగ్‌లు చేపట్టారు. పైపులకు మరమ్మత్తులు చేశారు. పూర్తిస్థాయిలో పనులు చేపట్టిన తర్వాత రంగులు వేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఇంటింటా సంక్రాంతులు..

పెద్ద పండుగ సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా ప్రజలు జరుపుకున్నారు. మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమను కుటుంబ సభ్యులతో కలిసి మదినిండుగా జరుపుకొని హాయిగా గడిపారు. సంక్రాంతి రోజున పెద్దలకు పాత్రలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కనుమ నాడు పశువులను రైతులు అందంగా అలంకరించి.. పూజలు చేసి సంప్రదాయాన్ని కొనసాగించారు. అలాగే బసవన్నల సందడి, ఆడపడుచులు వేసిన రంగవల్లికలతో పల్లెలు కళకళలాడాయి. చాలామంది పేదలకు వస్త్రదానం చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. మరికొన్ని చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యువకులు గాలిపటాలు ఎగరవేస్తూ సందడి చేశారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పలుచోట్ల సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. కొత్త దుస్తులు ధరించి యువతీ యువకులు ఆనందంతో గడిపారు. అలాగే ఆలయాల్లో ఘనంగా గోపూజలు నిర్వహించారు.

–సాక్షి నెట్ వర్క్


గారజగనన్న కాలనీ రీక్రియేషన్ గ్రౌండ్‌లో సంప్రదాయ నృత్య విజేతలకు బహుమతులు పంపిణీ


గారసతివాడలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తున్న దృశ్యం


గారకె. మత్స్యలేశంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


గార బందరువానిపేటలో సంక్రాంతి సంబరాలు


శ్రీకాకుళం కల్చరల్: కోదండరామాలయంలో గోపూజా కార్యక్రమం


శ్రీకాకుళం కల్చరల్:సంతోషిమాత ఆలయంలో గోవుకు పూజ చేస్తున్న దృశ్యం


ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెం తీరంలో సందర్శకుల సందడి


ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడలో వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయితీ రాజ్ వింగ్ అధ్యక్షుడు నేతింటి నీలం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ


శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళం వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోపూజలు

నిత్యాన్నదానానికి విరాళాలు





అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో అమలౌతున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన కూన వేణుగోపాలరావు కుటుంబ సభ్యులు రూ.1,11,111, అలాగే స్థానికులు అంధవరపు వెంకట ముకేష్ దంపతులు రూ.1,01,116 విరాళంగా మంగళవారం సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కనకరాజులకు అందజేశారు. రథసప్తమి పర్వదినాన దాతలకు విశిష్ట దర్శనానికి డోనర్ పాసులను అందజేస్తున్నామని, ఈనెల 20వ తేదీలోగా గతంలో రూ.లక్ష లేదా అంతకుమించి విరాళాలిచ్చిన దాతలు తమ రశీదులను, ఆధార్ కార్డులతో సహా వివరాలిచ్చి పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఈవో వై.భద్రాజీ కోరారు.

–అరసవల్లి

ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్డు



శ్రీకాకుళం నగరంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో బాకర్‌సాహెబ్‌పేటకు వెళ్లే రోడ్డులో మెయిన్‌రోడ్డుకి, అప్రోచ్‌రోడ్డుకి మధ్యలో తవ్వేసి వదిలేశారు. దీంతో చాలాకాలంగా అటువైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో పూడికలు తీసేసి ఆరు నెలలు కావస్తున్నా నేటికి అక్కడ రోడ్డుని సరిచేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు చొరవచూపి రోడ్డు పనులు పూర్తిచేసి ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

–శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

కోలాట బృందానికి సత్కారం



ఇటీవల విజయనగరం జిల్లా బొబ్బిలిలో నిర్వహించిన ఉత్తరాంధ్ర కోలాటం పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన జి.సిగడాం మండలం సంతవురిటి గ్రామానికి చెందిన బాలికల బృందానికి గ్రామ సర్పంచ్ బుడారి లక్ష్మణరావు బుధవారం సత్కరించి ఆర్థిక సాయం అందించారు. కోలాట గురువు నేతేటి కోటేశ్వరరావును ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

–జి.సిగడాం

బస్సులు కిటకిట..


బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

శ్రీకాకుళం అర్బన్: సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వచ్చినవారు తిరుగు ప్రయాణమవుతున్నారు. దీంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ బుధవారం ప్రయాణికులతో కిటకిటలాడుతూ కనిపించింది. దూరప్రాంతాలైన తమిళనాడు, కర్ణాటక, హైదరాబాద్, విజయవాడ వంటి దూరప్రాంతాల నుంచి వచ్చినవారితోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెంది.. వారి ఇళ్లకు వెళ్లేందుకు బస్సుల కోసం కాంప్లెక్స్‌కు చేరుకోవడంతో ఈ పరిస్థితి నెలకుంది. ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, హిరమండలం, కొత్తూరు, బత్తిలి, టెక్కలి, రాజాం, బొబ్బిలి వంటి మారుమూల ప్రాంతాలకు వెళ్లే బస్సులు సైతం రద్దీగా కనిపించాయి. ప్రయాణికుల తాకిడి ఉండడంతో అందుకు తగ్గట్లుగానే ఆర్టీసీ అధికారులు బస్సులను నడుపుతున్నారు.

ముగిసిన రంగనాథస్వామి యాత్ర


రంగనాథస్వామి యాత్రలో పాల్గొన్న భక్తులు


రంగనాథస్వామి నిజస్వరూపం

జి.సిగడాం: మండల కేంద్రంలో నిర్వహించిన రంగనాథస్వామి యాత్ర బుధవారంతో ముగిసింది. కనుమ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

కమ్మసిగడాం జాతర ఏర్పాట్లపై సమీక్ష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం:

కమ్మసిగడాం జాతర ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు జరగనుందని ఆలయ కమిటీ ప్రధాన కార్యదరి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. కమ్మసిగడాంలోని మహాలక్ష్మి అమ్మవారి కల్యాణ మండపంలో జాతర ఏర్పాట్లపై బుధవారం సమీక్ష నిర్వహించారు. జాతర సక్రమంగా జరిపేందుకు కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, జాతర అభివృద్ధిపై పలు అంశాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెలిచేటి రామకృష్ణ, వి.రాజరవిచంద్ర, వి.సూర్య తేజ, వెలిచేటి రాజశేఖర్, మన్నె లక్ష్మీ ప్రసాద్, సురేష్ కుమార్, మురళీధర్, రాజేష్, సింహాచల రాయుడు, కృష్ణానందం, మౌళి, రఘునాథ్, సత్యనారాయణ, జగన్నాథరావు, అప్పలరాజు, బొట్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.